
క్లుప్తంగా

కూడారై ఉత్సవం నేడు



శ్రీ శరణ్య వేంకటేశ్వర స్వామి

ఆనందపురం : మండలంలోని గంభీరంలో ఉన్న శ్రీ శరణ్య వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం కూడారై ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పైడా కృష్ణ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఉదయం 5: 30 గంటల నుంచి 108 వెండి గంగాళాలతో శ్రీ గోదా అమ్మవారిచే స్వామికి ప్రసాదాన్ని నివేదించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని గోదా సమేత శ్రీ శరణ్య వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు పొందాలని కృష్ణ ప్రసాద్ కోరారు.

జెడ్సీని కలిసిన నాయకులు



జెడ్సీ రామును సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

భీమునిపట్నం: భీమిలికి కొత్తగా వచ్చిన జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రామును వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పీఏసీఎస్ చైర్మన్ అక్కరమాని రామునాయుడు, నాయకులు అక్కరమాని మంగరాజు, జీరు వెంకటరెడ్డి, చిల్ల గణేష్‌రెడ్డి, జీరు వేణుగోపాల్‌రెడ్డి, పూతి దుర్గారెడ్డి, జీరు భరత్ రెడ్డి తదితరులు కలిసి రెండో వార్డులోని సమస్యలను వివరించారు. వాటిపై జెడ్సీ స్పందిస్తూ త్వరలో సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రామును నాయకులు సత్కరించారు.

విద్యార్థులకు కరాటే గ్రేడింగ్ బెల్ట్‌లు



గ్రేడింగ్ బెల్టులు, ధ్రువీకరణ పత్రాలతో విద్యార్థులు

భీమునిపట్నం: భీమిలిలోని షాడో షటోకాన్ డూ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కరాటే అభ్యసించే విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించి వాటిని అందించారు. ఇందులో ఎస్.వరుణ్ ఎల్లో, సీహెచ్.శివరాం ఆరంజ్, వై.వినీతరావు, కె.బాల స్వరూప్ బ్లూ, కె.మోహనశ్రీ, వి.సుశాంత్, ఎస్.అభినవ్ పర్పుల్, కె.ప్రిన్సీ మెరూన్ బెల్టులను సాధించారు. వీరు ఇందులో కీహన్, కాటా, కుముటి, వెపన్స్ తదితర విభాగాల్లో ప్రతిభ కనబరిచి బెల్టులు సాధించారు. ఈ పరీక్షలను కోచ్‌లు శివ, నర్సింగరావు నిర్వహించగా చీఫ్ కోచ్ ఎం.వెంకట రమణయాదవ్ బెల్టులు, ధ్రువీకరణ పత్రాలు అందించారు.

ఎల్లారమ్మ తల్లికి తులసి మాలలతో అలంకరణ



అలంకరణలో ఎల్లారమ్మ తల్లి

తగరపువలస: స్థానిక ఎల్లారమ్మ మెట్టపై అమ్మవారిని మంగళవారం తులసిమాలలతో అలంకరించారు. తగరపువలస, భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీకి చెందిన గ్రామాల ఆరాధ్యదేవత ఎల్లారమ్మ తల్లి విగ్రహాన్ని ప్రతి మంగళవారం విభిన్నంగా ఆలయ కమిటీ సభ్యులు అలంకరించి భక్తులకు దర్శనాలు కలిగిస్తున్నారు. మంగళవారం వేళ ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉండటంతో ఆవరణలో దాతల సాయంతో అన్నప్రసాదం పంపిణీ చేశారు.

గ్రావెల్ మైనింగ్‌తో పర్యావరణానికి ముప్పు

- ప్రజాభిప్రాయ సేకరణలో జగన్నాథపురం వాసుల అభ్యంతరం
- ఉన్నతాధికారులకు నివేదిస్తామన్న డీఆర్వో శ్రీనివాసరావు



కార్యక్రమంలో అభిప్రాయం వ్యక్తం చేస్తున్న రైతు

ఆనందపురం : గ్రావెల్ మైనింగ్‌తో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని చందక పంచాయతీ జగన్నాథపురం రైతులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో క్వారీ నిర్వహణకు సమ్మతించేది లేదని అధికారులకు స్పష్టం చేశారు. మండలంలోని చందక పంచాయతీ, జగన్నాథపురంలో గ్రావెల్ మైనింగ్ కోసం గ్రామంలో మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు.

రఫ్ స్టోన్ గ్రావెల్ మైనింగ్ ప్రాజెక్ట్ సంస్థ ఇక్కడ సర్వే నంబరు 1లో గల 19.53 హెక్టార్లలో గ్రావెల్ మైనింగ్ చేయడానికి ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంది. ఈ మేరకు డీఆర్వో శ్రీనివాసరావు, తహసీల్దార్ లోకవరపు రామారావు, కాలుష్య నియంత్రణ మండలి విభాగం ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులు ముందుగా మైనింగ్ విషయమై పలు అంశాలు చదివి వినిపించి ప్రజల అభిప్రాయాలు కోరారు.

క్వారీ నిర్వహణతో వాతావరణ కాలుష్యం

ఈ మేరకు పలువురు రైతులు మాట్లాడుతూ ఆ భూములపై తోటలు పెంచుకుంటూ జీవనోపాధి పొందుతున్నామని తెలిపారు. అలాగే పశువులకు మేత కోసం ఆధార పడుతున్నామని, క్వారీ నిర్వహిస్తే దుమ్ము రేగి వాతావరణం కాలుష్యమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే దీని పక్కనే సుమారు మూడు వందల ఎకరాల ప్రభుత్వ భూమిని గ్రేహౌండ్స్ నిమిత్తం రైతుల నుంచి సేకరించి మూడేళ్లు అవుతోందని... కానీ ఇంతవరకూ పరిహారం అందించలేదని అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా డీఆర్వో శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు లేవలెత్తిన అంశాలన్నింటినీ జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యల కోసం సిఫార్సు చేస్తామని వివరించారు. అలాగే గ్రేహౌండ్స్ పరిహారం విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని చెప్పారు. మైనింగ్ ప్రాజెక్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ క్వారీ నిర్వహణ సమయంలో కాలుష్యం ఏర్పడకుండా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బంక శ్రీను, ప్రజలు పాల్గొన్నారు.

సంక్రాంతి వేళ దొంగలతో అప్రమత్తత అవసరం



ఆటో ద్వారా తగరపువలసలో ప్రచారం చేస్తున్న భీమిలి క్రైం ఎస్ఐ సూర్యప్రకాష్

తగరపువలస: సంక్రాంతి పర్వదినం సందర్భంగా భీమిలి ప్రజలు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరుతూ క్రైం ఎస్ఐ సూర్యప్రకాష్ మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి కరపత్రాలు పంపిణీ చేశారు. మార్కెట్లు, షాపింగ్‌మాల్స్‌లో జేబుదొంగలు ఉంటారని హెచ్చరించారు. ఆటో, బస్ వంటి ప్రజారవాణాలో బ్యాగులు, బంగారు ఆభరణాలు జాగ్రత్తగా పరిరక్షించుకోవాలన్నారు. బ్యాంకులు, ఏటీఎం కేంద్రాలు, బంగారు ఆభరణాల దుకాణాలకు వెళ్లేటప్పుడు అపరిచితులను నమ్మవద్దన్నారు. నగదు, విలువైన ఆభరణాలు ఇంట్లో కాకుండా బ్యాంకు లాకర్లలో దాచుకోవాలని హితవుపలికారు. ఫోన్ల ద్వారా అధికారులు ఎవరూ బ్యాంకు ఖాతాలు, ఏటీఎం పిన్ నంబర్లు అడగరన్నారు. ఇల్లు విడిచి ఏదైనా ఊరు వెళ్తే భీమిలి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అపరిచిత వ్యక్తులు సంచరిస్తున్నట్టు అనుమానం కలిగితే పోలీసులకు లేదా 100 నంబరుకు డయల్ చేసి సమాచారం అందించాలని కోరారు.

భూ తగాదాలో పలువురికి గాయాలు

ఆనందపురం : మండలంలోని చందకలో మంగళవారం రెండు కుటుంబాల మధ్య భూ తగాదా జరిగి ఇరువురు గాయపడి చికిత్స పొందుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చందక గ్రామానికి చెందిన లోలుగు కృష్ణ, లోలుగు రాములమ్మ కుటుంబాలకు ఉమ్మడి ఆస్తులు ఉన్నాయి. గత కొద్ది రోజుల నుంచి ఆ గ్రామంలో భూముల రీ సర్వే జరుగుతోంది. ఈ మేరకు మంగళవారం సర్వే బృందాలు భూములను సర్వే చేస్తుండగా ఆ రెండు కుటుంబాల వారికి 18 సెంట్లు భూమి తేడా వచ్చి గొడవ పడ్డారు. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు కర్రలతో దాడి చేసుకొని కొట్టుకున్నారు. ఈ సంఘటనలో కృష్ణ ఎడమ చేయి విరగ్గా, పెంటయ్య రాములమ్మకు గాయాలయ్యాయి. ఈ మేరకు వారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించి ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మరగడ అప్పారావు

పద్మనాభం: క్రీడలతో మానసిక ఉల్లాసం పెంపొందుతుందని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మరగడ అప్పారావు అన్నారు. మండలంలోని రేవిడిలో అనంత ప్యాషన్ దుస్తుల షాపు యజమాని ఆర్థిక సహకారంతో రెండు రోజులు నిర్వహించనున్న భీమునిపట్నం నియోజకవర్గ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువకులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. టోర్నమెంట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి వరుసగా రూ.6 వేలు, రూ.3 వేలు, రూ.2వేలు నగదు బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. పోటీలో 18 జట్లు తలపడనున్నాయి. కార్యక్రమంలో రేవిడి హైస్కూల్ హెచ్ఎం ఐ.వి.రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సరకుల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు సరకులు అందజేసి సన్మానిస్తున్న మహంతి అప్పలరమణ

పద్మనాభం: మండలంలోని పాండ్రంగిలో ముగ్గురు పారిశుధ్య కార్మికులకు పంచాయతీ వార్డు మెంబర్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మహంతి అప్పల రమణ మంగళవారం నిత్యవసర సరకులు అందజేసి దుశ్శాలువాలతో సన్మానించారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని వీరికి 35 రకాల నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉప్పాడ అప్పారావు, ప్రసాద్ పట్నాయక్, రెడ్డిపల్లి శ్రీనివాసరావు, పాలూరి కృష్ణారావు, హంస మహేష్ పాల్గొన్నారు.

కొండ గెడ్డ, రహదారి ఆక్రమణపై ఫిర్యాదు



తహసీల్దార్ లోకేశ్వరరావుకు ఫిర్యాదు చేస్తున్న ఎంపీపీ రాంబాబు, రైతులు

పద్మనాభం: మండలంలోని మద్ది పంచాయతీ తుని పాలంలో కొండ గెడ్డ, పశువులు, మనుషులు రాకపోకలు సాగించే రహదారిని ఆక్రమించే భూస్వామిపై ఎంపీపీ కంటుబోతు రాంబాబు, ప్రజలు మంగళవారం తహసీల్దార్ ఎం.వి.ఎస్.లోకేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. విజయరాంపురం కొండ నుంచి వర్షపు నీరు వచ్చే తునిపాలం కొండ గెడ్డ కాలువ, తునిపాలం నుంచి విజయరాంపురం వైఎస్సార్ కాలనీకి మనుషులు, పశువులు రాకపోకలు సాగించే రహదారిని భూస్వామి ఆక్రమించుకున్నారని ఆ ఫిర్యాదులో తెలిపారు. దీనిపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణే ధ్యేయం



మధురవాడలో పతాకావిష్కరణ చేస్తున్న నాయకులు

మధురవాడ: ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధనకు పోరాటాలు మరింత విస్తృతం చేయడమే ధ్యేయంగా ఈ నెల 18 నుంచి 22వ తేదీ మధ్యలో బెంగళూరులో సీఐటీయూ జాతీయ మహాసభలు నిర్వహించనున్నామని పలువురు నాయకులు పేర్కొన్నారు. జాతీయ మహా సభలను పురస్కరించుకుని మధురవాడ ద్రోణంరాజు కల్యాణ మండపం వద్ద సంఘ జెండాను మంగళవారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బి.రాంబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మధురవాడ జోన్ సీఐటీయూ అధ్యక్షుడు పి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ కార్మిక, కర్షక, ప్రజా ఐక్యతతో ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై తమ సంఘం అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. సభలు విజయవంతానికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. సిటు నాయకులు డి.అప్పలరాజు, కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన జీవో నంబర్ 1 ప్రమాదకరంగా ఉందని, దానిని వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవ్వడం ఒక యోగం



బంగ్లామెట్ట పాఠశాలలో నవ్వుల దినోత్సవం జరుపుకుంటున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

తగరపువలస: మనిషికి నవ్వు నాలుగు విధాలుగా మేలు చేస్తుందన్న మాటలను మంగళవారం బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు గుర్తు చేశారు. నవ్వుల దినోత్సవం సందర్భంగా ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లడుతూ నవ్వు ఆవశ్యకత వివరించారు. దేశంలో మొదటిసారిగా 1998 జనవరి 10న కటారియా నవ్వుల దినోత్సవం పరిచయం చేశారన్నారు. వ్యక్తులు తమను మార్చుకోవడానికి, ప్రపంచాన్ని శాంతియుతంగా ఉంచడానికి శక్తివంతమైన భావోద్వేగం నవ్వు మాత్రమేన్నారు. నవ్వకపోవడం కొందరు రోగంగా పరిగణిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు కాసేపు నవ్వుతూ కాలం గడిపారు. ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, పిన్నింటి నాగమణి, బుగత మల్లిక తదితరులు పాల్గొన్నారు.

96 మంది దివ్యాంగులకు ఉద్యోగాలు

బక్కన్నపాలెం శిక్షణ కేంద్రంలో జాబ్ మేళా



జాబ్ మేళాలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

పీఎం పాలెం: ప్రతిభ, నైపుణ్యం ఉంటే ప్రగతికి వైకల్యం ఏమాత్రం అడ్డు కాబోదని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ ప్రాజెక్టు అధికారి టి.విజయ్ కుమార్ అన్నారు. జీవీఎంసీ 6వ వార్డు పరిధి బక్కన్నపాలెంలోని ఏపీ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ శిక్షణ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో 96 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు అయినప్పటికీ ఎంతో మంది వివిధ రంగాల్లో రాణిస్తున్నారని గుర్తు చేశారు. ఈ సంస్థలో శిక్షణ పొందుతున్న వారికి విద్యా సంవత్సరం ముగింపు నెల ఆగస్టులో జాబ్ మేళా నిర్వహిస్తామని ఆయన తెలిపారు. యూత్ ఫర్ జాబ్స్ సెంటర్ మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో ప్రముఖ సంస్థల్లో 120 మందికి ఉద్యోగాలు కల్పించేందుకు అవకాశం ఉందన్నారు. స్థానిక శిక్షణ సంస్థ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఐ.అబద్దం మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు జాబ్‌మేళా మంచి అవకాశం అన్నారు. జాబ్‌మేళాకు 116 మంది హాజరుకాగా 96 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో శిక్షణ సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

14న గోదారంగనాథుల కల్యాణం

కొమ్మాది: రుషికొండ శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 14న గోదా రంగనాథుల కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు టీటీడీ నిర్వాహకులు తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి 12 వరకు కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నామని తెలిపారు. విశ్వక్షేణ ఆరాధన, పుణ్యహవచనం, మాంగళ్యధారణ, అక్షతరూపన కార్యక్రమాలు నిర్వహించనున్నామని అర్చకులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి కల్యాణం వీక్షించాలని కోరారు. కల్యాణంతో ధనుర్మాసోత్సవాలు ముగుస్తాయని అర్చకులు తెలిపారు.

ఎక్కడి చెత్త అక్కడే



ఎండాడలో రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. ఎండాడ బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, రుషికొండ వాడపాలెం ప్రాంతాల్లో రోడ్డు మీద చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోంది. రోజుల తరబడి శానిటరీ సిబ్బంది ఇక్కడి చెత్త తొలగించకపోవడంతో సమీపంలో ఉన్న నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి చెత్త తొలగించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

శ్మశానవాటికలో విశ్రాంతి గది నిర్మాణం

- సంక్రాంతి రోజు ప్రారంభించనున్న ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు



చిట్టివలస శ్మశానవాటికలో ఫ్రెండ్స్ హెల్పింగ్ హ్యాండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్మిస్తున్న విశ్రాంతి గది

తగరపువలస: చిట్టివలస శ్మశానవాటిక ఆవరణలో ఫ్రెండ్స్ హెల్పింగ్ హ్యాండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రూ.1.60 లక్షలతో విశ్రాంతి గది నిర్మించింది. అంతిమయాత్రతో వచ్చేవారి విశ్రాంతి కోసం నిర్మించిన గదిని సంక్రాంతి రోజు ప్రారంభించనున్నారు. జీవీఎంసీ 1, 2 వార్డులకు చెందిన సుమారు 25వేల మంది ప్రజలు తమ సంబంధీకులు మృతి చెందినప్పుడు ఈ శ్మశానవాటికను వినియోగిస్తుంటారు. అయితే ఇక్కడ కనీస వసతులు లేకపోవడంతో పేకాటరాయుళ్లు, తాగుబోతులకు అడ్డాగా మారిపోయింది. దీనిని ఆనుకుని ఉన్న గోస్తనీనది మధ్య ప్రాంతం కోడిపందాల ఆటకు వేదికగా వినియోగిస్తుంటారు. ఈ ఆవరణలో తుప్పలతో నిండిపోవడంతో విషపురుగుల సంచారం ఎక్కువగా ఉంటుంది. చనిపోయిన బంధువుల మృతదేహాల వెంట వచ్చే వారికి శ్మశానవాటికలో ఎండా, వానల నుంచి తల దాచుకునే అవకాశం లేకపోవడంతో ఫ్రెండ్స్ హెల్పింగ్ హ్యాండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ స్పందించి ముందుకొచ్చింది. గత ఏడాది డిసెంబర్ 4న శంకుస్థాపన చేసి కేవలం 35 రోజుల్లోనే విశ్రాంతి గది నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. అసోసియేషన్‌లో భవన నిర్మాణ కార్మికులు, యజమానులు ఉండడంతో తక్కువ కాలంలో తక్కువ ఖర్చుతో గది నిర్మించడాన్ని చిట్టివలస ప్రజలు అభినందిస్తున్నారు.

నిధులు మింగేసిన టీడీపీ నాయకులు

గత ప్రభుత్వ హయాంలో మంత్రి గంటా శ్రీనివాసరావు చిట్టివలస శ్మశానవాటిక అభివృద్ధి పనులకు రూ.34 లక్షల నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో ప్రహరీ, విశ్రాంతి గతి, బోరుబావి, గేట్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా పట్టణ టీడీపీ నాయకులు కాంట్రాక్ట్ పనులు చేపట్టి కేవలం ఒక్కవైపు మాత్రమే నాసిరకం మెటీరియల్‌తో ప్రహరీ నిర్మించి మిగిలిన పనులకు దుమ్మా కొట్టేశారు. అప్పట్లో సుమారు రూ.16 లక్షల నిధులు గోల్‌మాల్ కావడంతో స్థానికులు ఇక్కడి టీడీపీ నాయకులను దుమ్మెత్తిపోశారు. అంతకు ముందు ఇదే శ్మశానవాటికలో సత్యసాయి సేవాసంస్థల ఆధ్వర్యంలో దహనవాటిక నిర్మించిన సంగతి తెలిసిందే.

అందరి భాగస్వామ్యంతో నగరాభివృద్ధి



జెడ్సీని అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు తదితరులు

మధురవాడ: ప్రజలంతా యూజర్ చార్జీలు సకాలంలో చెల్లించి నగరాభివృద్ధిలో భాగస్వాములు కావాలని జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 కమిషనర్ కొట్యాడ కనక మహాలక్ష్మి కోరారు. 7వ వార్డులోని వివిధ ప్రాంతాల్లో యూజర్ చార్జీల చెల్లింపుపై మంగళవారం ఆమె అవగాహన కల్పించారు. పలు చోట్ల వ్యాపారులు, గృహ యజమానుల నుంచి వసూలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాసరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల అభినందనలు

కొత్తగా బాధ్యతలు చేపట్టిన జెడ్సీ కొట్యాడ కనక మహాలక్ష్మిని జోనల్ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిసి అభినందనలు తెలియజేశారు. శానిటేషన్ మెరుగు పరిచేందుకు చర్యలు చేట్టాలని కోరారు. సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు పీకేఎం పాత్రుడు, చేకూరి రజని, బంగారు ప్రకాశ్, పెంద్ర అప్పన్న, బెల్లాపు పాపారావు, తమ్మిన వరలక్ష్మి, పసుపులేని గోపి తదితరులు పాల్గొన్నారు.

హరిజన సంతపేటలో పైప్‌లైన్ నీరు వృథా



పైప్‌లైన్ నుంచి లీకై సంతపేట రహదారిపై నిలిచిపోయిన నీరు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు హరిజన సంతపేటలో కొంతకాలంగా పైప్‌లైన్ లీకేజీ కారణంగా తాగునీరు వృథాగా పోతోంది. భీమిలి రోడ్డు నుంచి దిగువకు ధారగా ప్రవహిస్తున్న నీరు నిర్మాణంలో ఉన్న సీతారామాలయం వద్ద రోడ్డుపై నిలిచిపోతోంది. దీంతో వాహనాల రాకపోకలు కారణంగా నీరు రహదారికి ఇరువైపులా ఇళ్లపైకి చేరుతోందని ఇళ్ల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం తాగునీరు వృథాగా పోతున్నా ఇంజినీరింగ్ అధికారులు పైపులైన్‌కు మరమ్మతులు చేయడం లేదని స్థానికులు అంటున్నారు. పైపులైన్ లీకేజీ కారణంగా వృథాగా పోతున్న నీటిని రహదారిపైకి రాకుండా తాత్కాలికంగా పక్కనే ఉన్న డ్రైనేజీలోకి మళ్లించాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా శిథిల వాటర్ ట్యాంక్



శిథిలమై ప్రమాదకరంగా మారిన వాటర్ ట్యాంక్



ప్రైవేటు వ్యక్తుల కోసం వినియోగిస్తున్న పంప్‌హౌస్

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు పరదేశిపాలెం ఈడబ్ల్యూఎస్ కాలనీలో జాతీయ రహదారిని ఆనుకుని నివాసాల మధ్య ఉన్న వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుని కూలేందుకు సిద్ధంగా ఉంది. సుమారు 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ట్యాంక్ 2005 తర్వాత మూలకు చేరి నిరుపయోగంగా మారిపోయింది. ఈ క్రమంలో పెచ్చులూడి కూలేందుకు సిద్ధంగా ఉంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ఈ వాటర్ ట్యాంక్‌కు సంబంధించిన పంప్ హౌస్ మాత్రం కొందరు తాగునీటి విభాగం సిబ్బందికి వరంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పంప్‌హౌస్‌ను అనధికారకంగా ప్రైవేటు వ్యక్తులు ఉపయోగించుకునేందుకు సహకరిస్తున్నారు. ఈ విషయం ఇటీవల కాలనీకి వచ్చిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. వాటర్ ట్యాంక్ కూలగొట్టి, దాని స్థానంలో సామాజిక భవనం నిర్మించాలని కోరారు. ఆ దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఎవరూ పట్టించుకోలేదు. ప్రమాదం జరగకముందే అధికారులు ట్యాంక్ తొలగించాలని కోరుతున్నారు.

గోడలు ఖరాబు చేస్తున్న సెప్టిక్లీనర్ల ప్రతినిధులు



భీమిలి జోన్ సంతపేటలో గోడపై స్టిక్కర్లు అంటిస్తున్న సెప్టీక్లీనర్ల ప్రతినిధులు

తగరపువలస: సెప్టీక్లీనర్ల ప్రచారం కోసం వాటి యజమానులు తమ ప్రతినిధులతో భీమిలి జోన్‌లో గోడలను ఖరాబు చేస్తున్నారని ఆయా ఇళ్ల యజమానులు వాపోతున్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా చాలావరకు ఇళ్ల యజమానులు వేలాది రూపాయలు ఖర్చు చేసి గోడలకు పెయింటింగ్ పనులు చేయించుకుంటున్నారు. ఇలా పెయింటింగ్ చేయించుకున్న ఇళ్లపై సెప్టీక్లీనర్ల యాజమాన్యాల ప్రతినిధులు ప్రచార స్టిక్కర్లు అంటిస్తున్నారు. ఇళ్ల యజమానులు వీటిని తొలగించే ప్రయత్నం చేయగా అక్కడ పెయింట్ ఊడిపోయి ఎబ్బెట్టుగా కనిపిస్తుందని వాపోతున్నారు. వీధిదీపాల స్తంభాలు, పాతభవనాల గోడలపై స్టిక్కర్లు అంటించినా ఎవరూ అభ్యంతరం చెప్పడం లేదు. కానీ పండగలు, పెళ్లిళ్ల వంటి సమయాల్లో అలంకరించిన ఇళ్లపై స్టిక్కర్లు వేయడాన్ని మాత్రం ఖండిస్తున్నారు. ఇలా ఇళ్లపై స్టిక్కర్లు అంటించి ఖరాబు చేస్తున్న సెప్టీక్లీనర్ల యాజమాన్యాలపై జీవీఎంసీ, సచివాలయ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.